

తీన్మార్ మల్లన్న-ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు


తెలంగాణ
# జీవగడ్డ
ఎడిటర్:
మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక






ఎడిటర్ : మోటపలుకుల వెంకట్ , ఆదివారం 15-02-2026 సంపుటి :02 సంచిక : 127 పేజీలు :04 వెల : 3.00


## మున్సిపల్ ఎన్నికల్లో మతాన్ని రెచ్చగొట్టినా
# బీజేపీ ఏం సాధించలేకపోయింది



**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 :**
నిజామాబాద్ కార్పొరేషన్‌ను తామే కైవసం చేసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఈరోజు (శనివారం) సమావేశం అవుతానని.. ఈ భేటీలో కార్పొరేషన్‌ల గురించి చర్చించి అన్ని నిర్ణయాలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ వేదికగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. కరీంనగర్ కార్పొరేషన్ కూడా తమ ఖాతాలోకే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీపీఐ నేతలతో మాట్లాడుతున్నామని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జగిత్యాలలో కాంగ్రెస్ వారే ఛైర్మన్‌గా ఉంటారని స్పష్టం చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో మతాన్ని రెచ్చగొట్టినా బీజేపీ ఏం సాధించలేకపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఈ ఎన్నికల్లో 90 శాతం గెలవాలని రూల్ ఏమైనా ఉందా..? అని ప్రశ్నించారు. కవితకు ఈ ఎన్నికలు ఉత్సాహాన్ని ఇచ్చి ఉండవచ్చని అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉండదని చెప్పుకొచ్చారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా అత్యధిక స్థానాలను గెలుస్తామని జోస్యం చెప్పారు. హైదరాబాద్ గ్రేటర్ ఎన్నికల్లో కూడా తామే విజయం సాధిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.




# మున్సిపల్ ఫలితాలతో
## ఆ రెండు పార్టీల పొత్తుకు తొలి అడుగు

**హైదరాబాద్, ఫిబ్రవరి 14:**
మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీన పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు.కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు.'జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు.

# ప్రేమ పేరుతో మోసాలు
## యువతను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు




## ముంబైలో కుప్పకూలిన
# మెట్రో పిల్లర్ స్లాబ్




**ముంబై, ఫిబ్రవరి 14 :** ముంబైలోని ఓ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్‌లోని కొంత భాగం ఇవాళ (శనివారం) కుప్పకూలింది. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. క్షతగ్రాతులను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన ములుంద్ వెస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. నిర్మాణంలోని పిల్లర్‌లో కొంత భాగం అకస్మాత్తుగా కూలిపోవడంతో.. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వారు శిథిలాల కింద చిక్కుకున్నారు.వెంటనే అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పిల్లర్ శిథిలాలు కూలిపోవడంతో అక్కడ పార్క్ చేసిన పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. శిథిలాలను తొలగించే పనులు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. రక్షణ చర్యలు కొనసాగుతుండగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పుల్వామా సంఘటన దేశానికి బాధాకరం

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ**
**ఘనంగా నివాళులర్పించిన టీఆర్పీ పార్టీ నాయకులు**
**దేశ సరిహద్దుల్లో జవాన్లు ప్రాణాలర్పిస్తున్నారు**
**అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలి**
**ఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా**







**తెలంగాణ జీవగడ్డ, కరీంనగర్**

2019 ఫిబ్రవరి 14 రోజున తేదీని వినగానే ప్రతి భారతీయుల రక్తం ఉడుకుతుంది. ఈ రోజు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై పుల్వామా జిల్లాలో, జైషే-మహ్మద్ ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది మన దేశ వీర జవాన్లు అమరులైన వారికి కరీంనగర్ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా కొవ్వొత్తులతో జిల్లా కేంద్రంలో ఉద్యోగ విరమణ పొందిన ఆర్మీ జవాన్లతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి ఘన నివాళులర్పించారు. అనంతరం మీడియాతో రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ సుమారు 2500 మందికి పైగా జవాన్ల కన్వాయ్ లో వెళ్తుండగా, పేలుడు పదార్థాలతో నిండిన కారును ఉగ్రవాదులు జవాన్ల బస్సును ఢీకొట్టి ఆ ప్రాంతమంతా కన్నీటి కడలిగా మార్చడం దేశానికి చాలా బాధాకరమని అన్నారు. జవాన్ల త్యాగం మన బాధ్యత అని అంటూ ప్రతి రోజు దేశవ్యాప్తంగా మనం ఇంట్లో హాయిగా నిద్రపోతున్నామంటే, దానికి కారణం సరిహద్దుల్లో కాపలా కాసే సైనికులేనని గుర్తుచేశారు. వారు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ ప్రజల ప్రాణాల్ని సురక్షితంగా కాపాడుతున్నారని అన్నారు. పుల్వామాలో అమరులైన జవాన్ల త్యాగం వృధా పోదు. ఆ ఘటన మన దేశాన్ని మరింత ఏకం చేసిందని హితవు పలికారు. “వీర జవాన్ల త్యాగాలను మనం ఎప్పటికీ మర్చిపోకూడదని ఉగ్రవాదం అనేది మానవాళికి పెద్ద శత్రువని అన్నారు. మన సైనికుల ధైర్య సాహసాలకు, అమరవీరులకు సెల్యూట్ చేస్తూ, వారి కుటుంబాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ద్వారా సంఘీభావాన్ని తెలుపుతామని అన్నారు. దేశ రక్షణ సేవలో మరణించిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని అన్నారు. యుద్ధంలో సైనికులు మరణించకుండా సకల సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, రిటైర్డ్ ఆర్మీ జవాన్లు సయ్యద్ షాహిద్ హుస్సేన్, సత్యనారాయణ రెడ్డి, ఎస్వీ బాబు, బాలయ్య, ఎండి శన్నా, టిఆర్పీ పార్టీ జిల్లా , మండల, టౌన్ నాయకులు ఎండి వాజిద్, చాంద్ పాషా, రాకేష్, ఎగుర్ల రమేష్, అంకుశవలి, ఇశ్రాత్ శావాలి, జింక లావణ్య, భోగ భాస్కర్, ఓర్సు రాజు, చిగుర్ల మోహన్, శేఖర్, విమల, చిత్ర, మంగ, మహబూబ్ అలీ, గణేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




విలేకరులు కావలెను
తెలంగాణ జీవగడ్డ
ఎడిటర్: మోటపలుకుల వెంకట్ డిజిటల్ పత్రిక
తెలంగాణ జీవగడ్డ పేపర్, చానల్‌లో పనిచేయుటకు జిల్లా స్టాఫర్స్, ఆర్సీలు, మండల రిపోర్టర్స్ కావలెను.
ఆసక్తి గలవారు వెంటనే కాల్ చేయండి 7993613224

## ప్రేమ అనేది విశ్వాసంపై నిలిచే బంధం

ప్రేమ అనేది విశ్వాసంపై నిలిచే బంధం కానీ ఆ విశ్వాసాన్ని దుర్వినియోగం చేసే వలలో పడకుండా జాగ్రత్తగా ఉండటం యువతకు అత్యవసరం. వాలెంటైన్స్ డే ఆనందంగా జరుపుకోవాలి గానీ, అప్రమత్తతను మరవకూడదు.ప్రేమ అనేది విశ్వాసంపై నిలిచే బంధం కానీ ఆ విశ్వాసాన్ని దుర్వినియోగం చేసే వలలో పడకుండా జాగ్రత్తగా ఉండటం యువతకు అత్యవసరం. వాలెంటైన్స్ డే ఆనందంగా జరుపుకోవాలి గానీ, అప్రమత్తతను మరవకూడదు.ఇందూరు, ఫిబ్రవరి 19: వ్యాలెంటైన్ అంటే ప్రేమ బహుమతులు, భావోద్వేగాల వేడుక. అయితే ఇదే సందర్భాన్ని కొన్ని సైబర్ మోసగాళ్ల అవకాశంగా మార్చుకుంటున్నారు. సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌లు, మేసేజింగ్ ప్లాట్‌ల ద్వారా పరిచయం పెంచుకుని భావోద్వేగాలను వాడుకుని దోచుకునే ఘటనలు పెరుగుతున్నాయి.ఫేక్ ప్రొఫైల్‌లతో పరిచయాలు..ప్రత్యేకంగా యువతనే లక్ష్యంగా చేసుకుని ఫేక్ ప్రొఫైల్‌లతో పరిచయం మొదలుపెట్టి, కొద్ది రోజుల్లోనే ప్రేమ పేరుతో దగ్గరవుతున్నారు. ఆ తర్వాత విదేశాల్లో గిఫ్ట్ పేరుతో డబ్బు అడగడం, వ్యక్తిగత ఫొటోలు పంపించమని ఒత్తిడి చేయడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వీడియో కాల్స్‌ను రికార్డు చేసి బ్లాక్ మెయిల్ చేసే కేసులు కూడా నమోదవుతున్నాయి.ఆర్థిక లావాదేవీలు చేయొద్దు..సైబర్ క్రైమ్ విభాగం అధికారుల ప్రకారం, పరిచయం అయిన వ్యక్తుల నిజ స్వరూపం తెలుసుకోకుండా ఆర్థిక లావాదేవీలు చేయడం ప్రమాదకరం. తెలియని లింకులు క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచిస్తున్నారు. మోసపోయినట్లయితే వెంటనే 1990 హెల్ప్‌లైన్ లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ సెక్యూరిటీ అధికారులు సూచిస్తున్నారు.

తెలంగాణ జీవగడ్డ
ఎడిటర్: మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక








## టీ20 ప్రపంచకప్ 2026
# ఇంగ్లండ్ టార్గెట్ 153

స్పోర్ట్స్ డెస్క్: టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా ఇంగ్లండ్, స్కాట్లాండ్ మధ్య మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్.. ఇంగ్లండ్‌కు153 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన స్కాట్లాండ్ 19.4 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. రిచీ బెరింగ్‌టన్ (32 బంతుల్లో 49) తృటిలో అర్ధ సెంచరీ మిస్ చేసుకున్నాడు. అలానే మైకెల్ జోన్స్ (20 బంతుల్లో 33 పరుగులు), టామ్ బ్రూస్ (18 బంతుల్లో 24 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో అదిల్ రషీద్ 3 వికెట్లు పడగొట్టాడు. అలానే జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్ చెరో రెండు వికెట్లు సాధించగా... జేమీ ఓవర్టన్, సామ్ కరన్ ఒక్కో వికెట్ తీశారు.






తెలంగాణ జీవగడ్డ
ఎడిటర్: మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక








## రోషన్.. ప్రీతి ముకుందన్

# జంటగా 'ఏమో ఏమో ఇది' షురూ

దర్శకుడు డా. శైలేష్ కొలను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశీ కలయికలో ఓ సినిమా రూపొందనుంది. రోషన్ మేకా , ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి 'ఏమో ఏమో ఇది' (జుఎశీ జుఎశీ ×ఎఱ) అనే టైటిల్ ను ఖరారు చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా టైటిల్ తో పాటు గ్లింప్స్ ను ఆవిష్కరించారు. తల్లి--కొడుకుల మధ్య సరదా సంభాషణతో గ్లింప్స్ మొదలైంది. నవతరం ప్రేమ బంధాలు, ఆధునిక వివాహాలు వంటి అంశాలను వినోదాత్మకంగా చూపించారు. 'హిట్' యూనివర్స్‌తో గుర్తింపు పొందిన దర్శకుడు శైలేష్ కొలను ఈ సినిమాతో కొత్త జానర్‌లో అడుగుపెడుతున్నారు. ఆయన తెరకెక్కిస్తున్న తొలి రొమాంటిక్ కామెడీ సినిమా ఇది. ఇందులో అభయ్ పాత్రలో రోషన్ మేకా నటిస్తున్నారు. నేటి జెన్ జీ తరం ప్రేమను ఆవిష్కరించే పక్కింటి అబ్బాయి తరహా పాత్రలో రోషన్, అపూర్వ పాత్రలో ప్రీతి ముకుందన్ కనిపించనున్నారు. హేషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుంది. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని ఆసక్తికర విషయాలు త్వరలో వెల్లడి కానున్నాయి. 2026 దసరా కానుకగా ఈ సినిమా విడుదల కానుందని మేకర్స్ తెలిపారు.

